క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సభ్యులు, ప్రజలకు కృతజ్ఞతలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యుల సహకారంతోనే నందిగామలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ పేర్కొన్నారు. వారు సోమవారం మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గ ప్రజలు తమపై ఎంతో ఆదరాభిమానాలు చూపుతున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలే తమ ధైర్యమని ఉద్వేగభరితంగా చెప్పారు. ప్రజలు తమ ఆదరాభిమానాలను భవిష్యత్తులో కూడా అందించాలని కోరారు. సాధికార యాత్ర సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించిన పోలీసు, ఆయా శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వత్సవాయి(పెనుగంచిప్రోలు): వత్సవాయి మండలం కంభంపాడు గ్రామంలోని రోజ్ స్కూల్‌లో మంగళవారం చిన్న ఆవుటపల్లి, పిన్నమనేని సిద్ధార్థ కంటి ఆసుపత్రి, కొమరగిరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈశిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు. కంటి వైద్య పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డుతో హాజరు కావాలని ఆయన సూచించారు.

ఒక వ్యక్తికి ఒకచోటే ఓటుహక్కు : ఆర్డీవో

వీరులపాడు: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కొత్త ఓట్లు నమోదు చేయటంతోపాటు ఒకే వ్యక్తికి రెండుచోట్ల ఓటు ఉన్నట్లయితే, ఒకచోట ఓటును తొలగిస్తామని ఆర్డీవో పి. సాయిబాబు తెలిపారు. జుజ్జూరు గ్రామంలో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నవారితోపాటు డబుల్ ఎంట్రీ ఓట్లపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆర్డీవో సాయిబాబు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని అటువంటి ఓట్లను గుర్తించి తొలగిస్తామన్నారు. ఓట్ల తొలగింపు, సవరణలపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని వివరించారు. తహశీల్దార్ ఆశయ్య నాయక్, డిప్యూటీ తహశీల్దార్ ఆంజనేయులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్లతో విద్యార్థులకు ఎంతో మేలు



కంచికచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల మేధాశక్తిని పెంచేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని ఎంఈవో బాలాజీ నాయక్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఎగ్జిబిషన్ల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన, ఆసక్తి పెరుగుతాయని చెప్పారు. సైన్స్ ఎగ్జిబిషన్లతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వత్సవాయిలో అభివృద్ధి పరుగులు

- రూ.6.55కోట్లతో అభివృద్ధి పనులు..
- మారిన పాఠశాలల రూపురేఖలు
- పెరిగిన మౌలిక వసతులు
- జలజీవన్ కింద రూ.3.26కోట్లు మంజూరు
- తీరనున్న మంచినీటి సమస్య
- గ్రామాభివృద్ధిపై ప్రజల హర్షం



వత్సవాయిలో ప్రారంభానికి ముస్తాబవుతున్న రైతుభరోసా కేంద్రం (ఆర్బీకే)

వత్సవాయి(పెనుగంచిప్రోలు): మండల కేంద్రం వత్సవాయి అభివృద్ధిపథంలో పయనిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఈ గ్రామానికి కోట్లాది రూపాయల నిధులను కేటాయించడంతో గ్రామంలో మౌలికవసతులు మెరుగుపడ్డాయి. గ్రామంలోని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా అభివృద్ధి చేశారు. సుమారు రూ.6.52కోట్లతో గ్రామంలో ఆయా అభివృద్ధి పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నాడు–నేడు కింద రూ.1.01కోట్లు..

నాడు–నేడు పథకం కింద వత్సవాయి జెడ్పీ పాఠశాలకు రూ.69.31లక్షలు, బీసీకాలనీలోని ప్రాథమిక పాఠశాల రూ.15.99లక్షలు, మూడో వార్డులోని పాఠశాలను రూ.16 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మంచినీటి వసతి, తరగతి గదుల సుందరీకరణ తదితర పనులు చేపట్టారు. దీంతో ఈ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నూతన హంగులు సంతరించుకున్నాయి.

రూ.96 లక్షలతో సొసైటీ భవనం..

గ్రామంలో ఉన్న పాత వ్యవసాయ సొసైటీ భవనం స్థానంలో అత్యాధునిక హంగులతో నూతన సొసైటీ భవనాన్ని రూ.96లక్షలతో నిర్మించారు. లాకర్ల సదుపాయంతోపాటు పలు సర్వీసులు పాన్‌కార్డులు, క్రెడిట్ కార్డులు, టెలిఫోన్, కరెంట్ బిల్లుల చెల్లింపులు తదితర సదుపాయాలను గ్రామస్తులకు కల్పించారు. నూతనంగా జన ఔషధి కేంద్రం కూడా సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేశారు.

రూ.53లక్షలతో పీహెచ్‌సీ అభివృద్ధి..

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో సుమారు రూ.53లక్షలతో లాబ్ నిర్మాణాలు చేపట్టారు. రూ.15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం, డ్రైనేజీ పనులు చేస్తున్నారు.

జలజీవన్ కింద రూ.3.26కోట్లు..

వత్సవాయి ప్రజలు 40ఏళ్లుగా మంచినీటి సమస్యను ఎదుర్కొంటుండగా, సమస్య పరిష్కారానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఎమ్మెల్యే చొరవతో జలజీవన్ పథకం కింద రూ.3.26కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో లింగాల వద్ద మునేరు నుంచి జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో మంచినీటి పైపులైన్ పనులు చేపట్టారు. అలాగే గ్రామంలో 3లక్షల లీటర్లు అందించే ఓవర్‌హెడ్ ట్యాంక్, సంప్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇలా

రూ.64లక్షలతో సచివాలయం, ఆర్బీకే..

వత్సవాయిలో రూ.43 లక్షలతో సచివాలయ భవనం, రూ.21లక్షలతో రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) భవన నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులు తుదిదశలో ఉన్నాయి. త్వరలోనే ఈ భవనాలను ప్రారంభించేందుకు అధికారులు, నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.



తుదిదశలో ఉన్న సచివాలయ భవనం పనులు

వత్సవాయి గ్రామాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఊహించని అభివృద్ధి..



నేను సర్పంచ్‌గా పనిచేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు పూర్తిచేయడం సంతోషంగా ఉంది. జలజీవన్ మిషన్ ద్వారా రూ.3.26కోట్లతో చేపట్టిన పనులు పూర్తయితే మంచినీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారమవుతుంది. ఇంత పెద్దఎత్తున నిధులు మంజూరు చేసినందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– భూక్యా సీతమ్మ, సర్పంచ్

సొసైటీ ద్వారా పౌరసేవలు..



వత్సవాయిలోని వ్యవసాయ సొసైటీ భవనాన్ని రూ.96లక్షలతో నిర్మించాం. కామన్ సర్వీస్ సెంటర్ కింద అన్ని రకాల పౌరసేవలు అందిస్తున్నాం. ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి తీసుకెళ్లుతుండగా ఆయన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నాలుగున్నరేళ్ల సీఎం జగనన్న పాలనలో వత్సవాయి ఎంతో అభివృద్ధి చెందింది.

– రంగిశెట్టి ముత్తయ్య, సొసైటీ అధ్యక్షుడు.

512 మంది పేదలకు ఇళ్లు..

గ్రామంలో ఇళ్లస్థలాలు లేని పేదల కోసం 512 గృహాలతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ఈ కాలనీల్లో ఇప్పటికే 300మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేయగా, మిగిలిన ఇళ్ల నిర్మాణాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.



జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లు

21న వాహనాల వేలం

తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): సరైన ధ్రువీకరణపత్రాలు లేకపోవడంతో ఆయా తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న మూడు వాహనాలను ఈనెల 21వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు జగ్గయ్యపేట ప్రాంతీయ రవాణాశాఖాధికారి ఎమ్.రవికుమార్ సోమవారం తెలిపారు. పేట ఆర్టీసీ డిపోలో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని ఆయన సూచించారు.

సుబ్రమణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మైన్స్ క్వార్టర్స్ వద్ద ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకాలను అర్చకులు తిరునగరి సంపత్ జానకీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

స్పందనకు రెండు అర్జీలు

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు అర్జీలు అందినట్లు తహశీల్దార్ పబ్బూరి శంకరబాబు తెలిపారు. ఇంటిస్థలం మంజూరు కోరుతూ ఓ అర్జీ, పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని కోరుతూ మరో అర్జీ అందినట్లు తహశీల్దార్ వివరించారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, ఏపీఎం కోట భాస్కరరావు, డీటీ నాగుల్‌మీరా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తాబాబీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



గండ్రాయిల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచి లూర్దుమేరీ, నాయకులు, వలంటీర్లు

గండ్రాయి(జగ్గయ్యపేట): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలులో సామాజిక న్యాయం పాటిస్తూ పేదలందరి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని గండ్రాయి సర్పంచి కొత్తపల్లి లూర్దుమేరీ పేర్కొన్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద సోమవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద ఆయా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సర్పంచి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని వివరించారు. గ్రామపార్టీ కన్వీనర్ కనపర్తి ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పథకాలతోపాటు పదవుల్లోనూ అత్యధిక భాగం కేటాయించి వారిని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలందరికీ అండగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి బండి రాజు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు నారసాని రాంబాబు, గ నాయకులు యలమందరావు, రాజేంద్ర, గోపి, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా భక్తులకు చీరల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి సేవలో పాల్గొనే మహిళా భక్తులకు శ్రీరామ్‌వివేక్, రాధారాణి దంపతులు సోమవారం చీరలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శ్రీరంగానాయకస్వామి ఆలయంలో విశేష పర్వదినాల్లో సేవలందిస్తున్న మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం మహిళా భక్త బృందం సభ్యులకు గోదాదేవి వద్ద ఉంచిన చీరలను అందజేసినట్లు వివరించారు. ఆలయ స్థానాచార్యులు రంగబాబు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జగ్గయ్యపేట తహశీల్దార్ సూర్యారావు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఈవీఎం, వీవీప్యాట్లపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని పోలింగ్‌కేంద్రాల్లో ఓటర్లకు ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. బీఎల్‌ఓలు ఆయా కేంద్రాల్లో ఓటర్లకు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈవీఎంల ద్వారా ఓటువేసే విధానంపై నూతన ఓటర్లు కూడా తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని కోరారు. డీటీ నాగరాజు, ఎలక్షన్ డీటీ కిషోర్‌బాబు, ఆర్‌ఐ ఆనంద్‌బాబు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సమాజహితం కోసం పనిచేయాలి

జుజ్జూరు(వీరులపాడు): సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరు నడుచుకోవడంతోపాటు సమాజహితం కోసం పనిచేయాలని నరసింహారావుపాలెం అగస్త్య పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ సూచించారు. మండలంలోని జుజ్జూరు శివాలయంలో సోమవారం ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షల జోలికి వెళ్లకుండా తోటివారికి సహాయపడాలన్నారు. నేటి యువత దురలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, ఈ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నరసింహారావుపాలెంలో లలిత పంచయాతన ఆలయం విశిష్టతను వివరించారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



బత్తినపాడు(కంచికచర్ల) : ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లతోపాటు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందని డిప్యూటీ తహశీల్దార్ షేక్ నాగుల్‌మీరా తెలిపారు. మండలంలోని బత్తినపాడు గ్రామంలో ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీ నాగుల్‌మీరా మాట్లాడుతూ ఈవీఎం, ఈఈ ప్యాడ్స్ నోటా వంటి కొత్త విధానాలతో ఓటర్లకు భరోసా కల్పించిందన్నారు. ఈవీఎంలు సాధారణ బ్యాటరీలపై పనిచేస్తాయని, వాటికి విద్యుత్ అవసరం లేదన్నారు. ఒక్కో ఓటింగ్ మిషన్ గరిష్టంగా 2వేల ఓట్లను నమోదు చేయవచ్చని వివరించారు. పోలీస్ సిబ్బంది, ఆపరేటర్, వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సుబ్రమణ్యషష్ఠిని పురస్కరించుకుని పట్టణంలోని కుమారస్వామినగర్‌లో వేంచేసియున్న సుబ్రహ్మణ్యస్వామి వారికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక జీవనాన్ని అవలంభించడం అలవర్చుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికతతో ఎన్నో ప్రయోజనాలున్నాయని చెప్పారు. అనంతరం అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు కలసి స్వామివారి శేషవస్త్రంతో ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడివాడ సాంబశివరావు, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



గండేపల్లిలో క్రిస్మస్ పాటకు డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న విన్సెంట్ డి పాల్ సొసైటీ ప్రతినిధులు, జయరాజు, బదరీనారాయణ

గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి ఎంపీపీ స్కూల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈసందర్భంగా ఎంఈవో బాలాజీ నాయక్ మాట్లాడుతూ అన్ని మతాలు సమానమేనన్నారు. ఏసుక్రీస్తు పుట్టుక గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు క్రిస్మస్ పాటలకు డ్యాన్స్‌లు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మేరుగ రామారావు, యూటీఎఫ్ నాయకులు కామా ప్రభాకర్, ఉపాధ్యాయులు జ్యోతి, గ్రేస్‌మణి, విజయపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక యేసు పవిత్ర హృదయ ఆర్‌సీఎం చర్చి వద్ద సెమీక్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి, అనుబంధ సంస్థ అయిన విన్సెంట్ ది పాల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ముందుగా చర్చి ఫాదర్ జి.జయరాజు ప్రార్థనలు చేశారు. బదరీనారాయణ ఆర్థిక సహకారంతో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఫాదర్ జయరాజు ప్రసంగిస్తూ క్రీస్తు మనందరి హృదయాల్లో జన్మించాలని, అదే అసలైన క్రిస్మస్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బదరీనారాయణ, సెయింట్ ఆన్స్ ఆస్పత్రి సుపీరియర్ సిస్టర్ మేరీ ఆంటోని, విన్సెంట్ ది పాల్ సొసైటీ విజయవాడ సెంట్రల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ పీఏ విజయకుమార్, ఏరియా కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.విజయకుమార్, జగ్గయ్యపేట ప్రెసిడెంట్ దామాల మరియమ్మ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అత్తపై దాడి కేసులో రెండేళ్ల జైలు

జగ్గయ్యపేట అర్బన్: అత్తపై దాడి కేసులో నిందితునికి రెండేళ్ల జైలుశిక్ష, రూ. రెండు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పట్టణంలోని నాగమయ్య బజారులో అత్తను గాయపరచినందుకు నిందితుడైన షేక్ మహ్మద్‌పై 2020లో జగ్గయ్యపేట పట్టణంలో కేసు నమోదైంది. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో సోమవారం అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.శోభారాణి నిందితునికి పైవిధంగా జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.ప్రగతి సీఐ, జానకీరామ్, ఎస్‌ఐ ఆనందకుమార్, కోర్టు పీసీ, ఆరుగురు సాక్షులను కోర్టులో విచారించినట్లు పీపీ తెలిపారు.

పేట మున్సిపల్ రోడ్లకు మహర్దశ



రూ.14కోట్లతో నిర్మించిన జగ్గయ్యపేట- చిల్లకల్లు రోడ్డు



శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయం వద్ద నిర్మించిన సిమెంటు రోడ్డు



సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేసిన ధనంబోడు రోడ్డు

- జగనన్న పాలనలో బాగుపడిన రోడ్లు
- పేట పట్టణంలో రూ.20.62కోట్లతో రోడ్ల నిర్మాణం
- రూ.4.15కోట్లతో డ్రైనేజీలు

జగ్గయ్యపేట అర్బన్: ఏ ప్రాంత అభివృద్ధి అయినా అక్కడి రోడ్లను చూసి చెప్పవచ్చు అంటారు ఆర్థిక వేత్తలు.. రోడ్లు అభివృద్ధి చెందితే రవాణా సౌకర్యాలు పెరిగి అన్నిరంగాలు అభివృద్ధి చెందుతాయని చెప్పవచ్చు. ఈ సూత్రీకరణను పాటిస్తూ జగ్గయ్యపేట మున్సిపల్ పాలకులు పట్టణంలోని రోడ్లను అభివృద్ధి చేశారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఏర్పడి నాలుగు దశాబ్దాలు గడిచినా అభివృద్ధి చెందని రోడ్లు..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ఆయా వార్డుల్లోని రోడ్లను సిమెంటురోడ్లుగా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడిన ఈ రెండేళ్లలో ఈ పనులు మరింత వేగాన్ని పుంజుకోవడంతో కోట్లాది రూపాయలతో సిమెంటురోడ్లు, డ్రైనేజీల నిర్మాణం సాగింది.

అన్నివార్డుల్లో సిమెంటురోడ్ల నిర్మాణం..

నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో అన్నివార్డుల్లో గణనీయమైన అభివృద్ధి జరిగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక కృషితో పట్టణంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. పట్టణంలోని 31వార్డుల్లో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపట్టారు. గడప గడపకు మనప్రభుత్వం ద్వారా ప్రతివార్డుకు రూ.20లక్షలు మంజూరు కాగా, ఈ నిధులతో రోడ్లు, డ్రెయిన్లను అభివృద్ధి చేశారు. గతంలో గతుకులు, గుంతలుగా ఉన్న రోడ్లన్నీ సీసీరోడ్లుగా రూపాంతరం చెందాయి. పేట నుంచి చిల్లకల్లు వెళ్లే రోడ్డును రూ.14కోట్లతో అభివృద్ధి చేశారు. జగనన్న



సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

నాలుగున్నరేళ్ల పాలనలో జగ్గయ్యపేట పట్టణంలో రూ.20.62కోట్లతో 10.52 కిలోమీటర్ల మేర సిమెంటురోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.4.15కోట్లతో 18.20 కిలోమీటర్ల పొడవున డ్రైనేజీల నిర్మాణం పూర్తిచేశారు.

మునుపెన్నడూ చూడని అభివృద్ధి



అభివృద్ధి విషయంలో గతానికి, ప్రస్తుతానికి చాలా తేడా ఉంది. జగ్గయ్యపేట పట్టణం ఈ నాలుగున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి చెందింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా మావార్డులో సిమెంటురోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సామినేని ఉదయభానును కోరగా వెంటనే నిధులు మంజూరు చేయించి రోడ్లు, డ్రెయిజీల నిర్మాణం చేపట్టారు.

ఉప్పెల్లి ప్రసన్నకుమార్, విలియంపేట, జగ్గయ్యపేట

జగనన్న పాలనతోనే సాధ్యమైంది



గతంలో ఏ ముఖ్యమంత్రి పాలనలో జరగని అభివృద్ధి పనులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేపట్టారు. పట్టణాభివృద్ధి కోసం ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 42ఏళ్ల మున్సిపాలిటీ చరిత్రలో పెద్ద ఎత్తున పనులు చేపట్టడంతో పట్టణ ప్రజలు సైతం సంతృప్తి వ్యక్తంచేస్తుండటంతో సంతోషంగా ఉంది.

రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ చైర్మన్, జగ్గయ్యపేట

● స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు

నందిగామ టౌన్: తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు అందినట్లు ఆర్డీవో సాయిబాబు తెలిపారు. రెవెన్యూశాఖకు సంబంధించి ఐదు, విద్యాశాఖకు మూడు, భూసర్వే కోసం ఒకటి, పోలీసుశాఖకు సంబంధించి మూడు అర్జీలు అందినట్లు వివరించారు. ఆయా అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఆర్డీవో వివరించారు.